ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 04.11.2025 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రపంచ స్థాయి కంపెనీల పెట్టుబడుల కు హైదరాబాద్ కేంద్రంగా మారుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.
2. ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తినే కొనుగోలు చేయాలనే సీసీఐ నిబంధనను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖ రాశారు.
3. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రులు , బిజెపి నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో సహా ముఖ్య నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.
4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు , రేపు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

**వాన్ గార్డ్**

ప్రపంచ స్థాయి కంపెనీలకు హైదరాబాద్ ఒక కేంద్రంగా మారిందంటూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటిలో వాన్ గార్డ్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్ ను ఐటి మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... వాన్ గార్డ్ సెంటర్ ప్రారంభించామంటేనే రాష్ట్రంలో టెక్నాలజీ, ఆవిష్కరణలకు ఒక గుర్తింపుగా భావిస్తున్నామని చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... వచ్చే ఏడాది లోగా హైదరాబాద్ లో 120 గ్లోబల్ క్యాపబిలిటి సెంటర్లను ఏర్పాటు చేసి కొత్తగా లక్షా 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ , అప్ స్కిల్లింగ్ లలో అత్యుత్తమ నైపుణ్య శిక్షణను అందించేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. వాన్ గార్డ్ జీసీసీ ఏర్పాటుతో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వ వ్యాప్తం అవుతుందని అన్నారు.

డెస్క్

**తుమ్మల లేఖ**

ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తినే కొనుగోలు చేయాలనే సీసీఐ నిబంధనను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. 20 వరకు తేమ శాతం ఉన్నా కొనాలని కోరారు. ఈ మేరకు కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు , సీసీఐ ఎండీ లలిత్ కుమార్ గుప్తాలకు మంత్రి నిన్న లేఖ రాశారు. కిసాన్ కపాస్ యాప్‌లో నమోదు, జిన్నింగ్ మిల్లులను ఎల్-1, ఎల్-2లుగా విభజించడం , తేమ శాతాన్ని 8 నుంచి 12కు పరిమితం

చేయడం సమస్యగా మారిందని ఆయన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎకరానికి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని , ఈ సీజన్‌లో ఇప్పటికే సీసీఐ ఒక్కో రైతు నుంచి ఎకరానికి 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేసిందని మంత్రి ప్రస్తావించారు.

డెస్క్

**కొండా సురేఖా**

జగిత్యాల జిల్లాలోని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయాన్ని సమగ్ర అభివృద్ధి చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖా అన్నారు. ధర్మపురి ఆలయ మాస్టర్ ప్లాన్ పై నిన్న సాయంత్రం సమీక్ష నిర్వహించిన కొండా సురేఖ... వచ్చే గోదావరి పుష్కరాలకు సంపూర్ణ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురిలో ఆగమ శాస్త్రం, వేద పండితులు, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయ పునర్ నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ప్రణాళికాలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ప్రెస్ నోట్

**చేప పిల్లలు**

రాష్ట్రంలో ఉచిత చేప పిల్లల పంపిణీని ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. 123 కోట్ల రూపాయలతో చేపడుతున్న ఈ పథకం ఎలాంటి లోటుపాట్లు లేకుండా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయంలో ఈ పథకం అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు , మత్స్యశాఖ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ

సందర్భంగా ఆయన మాట్లాడుతూ..   . ప్రతి చెరువు వద్ద వివరాలు తెలిసేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, పంపిణీ ప్రక్రియను టీమత్స్య యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు.

డెస్క్

**SIRCILLA:**

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద   , తమకు ఉచిత రేషన్ బియ్యం అందుతున్నాయని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లబ్ధిదారు సూత్రం రమేష్ చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ......

బైట్ ... సూత్రం రమేష్

పిటిసి, సిరిసిల్ల

బ్రేక్

**రేవంత్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు. రెహమత్ నగర్ డివిజన్ లోని ఆయా ప్రాంతాల్లో రోడ్ షోలు  , కార్నర్ మీటింగ్ లలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

డెస్క్

**కాంగ్రెస్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ఈ ఉదయం ఏఐసిసి రాష్ట్ర ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తో పాటు       ,  పలువురు

మంత్రులు ఆయా డివిజన్ లలో ప్రచారం ముమ్మరం చేశారు. యూసుఫ్ గూడా డివిజన్ లో మీనాక్షితో పాటు , మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. మరోవైపు , మంత్రులు శ్రీధర్ బాబు , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఎమ్.ఎల్.ఏ మక్కాన్ సింగ్ , తదితరులు శ్రీనగర్ కాలనీలోని జి.హెచ్.ఎం.సి పార్కులో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినే గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గురించి పార్కులో వాకర్లకు వివరించారు.

పిఎన్

**<u>బిజెపి</u>**

మరోవైపు బిజెపి నాయకులు కూడా తమ పార్టీ అభ్యర్థిని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపించాలంటూ ప్రచారం చేస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బోరబండలో ఈ ఉదయం పాదయాత్ర చేపట్టారు. కాలనీలోని పోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మంత్రి పాదయాత్ర చేస్తున్నారు. కాలనీల్లో తిరుగుతూ బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరిస్తున్నారు. మరోవైపు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఎర్రగడ్డ డివిజన్ లో రెసిడెన్షియల్ కాలనీల ప్రజలతో ఈ ఉదయం సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ అభివృద్ధికి వాజ్ పేయ్ హయాం లోనే పునాదులు పడ్డాయని రామచందర్ రావు గుర్తు చేశారు.

డెస్క్

**<u>వేలం</u>**

హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ పరిధిలోని ఖరీదైన భూములను ఆన్‌లైన్‌లో వేలం వేయడానికి ప్రభుత్వం నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసింది. కోకాపేట పోలీస్‌లోని సర్వే నంబరు 239, 240లో మొత్తం 27 ఎకరాలను తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ వేలానికి పెట్టింది. ఎకరా కనీస ధర 99 కోట్ల రూపాయలుగా నిర్ణయించింది. ఈసారి 150 కోట్ల రూపాయలకు పైగానే ధర పలుకుతుందని భావిస్తున్నారు. ఆ లెక్కన ఈ 27 ఎకరాలకు 4 వేల కోట్ల పైచిలుకు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇటీవల రాయదుర్గంలో 7 ఎకరాలకు పైగా భూములను తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహించిన వేలం  పాటలో 1,357 కోట్ల రూపాయలకు  ఒక సంస్థ దక్కించుకుంది. ఇక్కడ కనీస ధర ఎకరాకు 101 కోట్ల రూపాయలుగా నిర్ణయించగా.. వేలంలో 177 కోట్ల రూపాయలు పలికింది.

డెస్క్

**ఉత్తమ పాఠశాల**

ఆసిఫాబాద్ జిల్లాలోని సావర్ ఖేడా ప్రాథమిక పాఠశాల పిఎం శ్రీ ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. నిన్న హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగయ్య ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రంగయ్య ఆకాశవాణితో మాట్లాడుతూ...

బైట్ ... రంగయ్య, ప్రధానోపాధ్యాయుడు

పిటిసి, ఆసిఫాబాద్

**వాతావరణం**

బంగాళాఖాతంలో ఈరోజు ఉపరితల చక్రవాత ఆవర్తనం ఏర్పడిందని , దీని ప్రభావంతో ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఎల్లుండి కూడా ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ప్రెస్ నోట్

**<u>బుక్ ఫెయిర్</u>**

38వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన వచ్చే నెల 19 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ ప్రకటించింది. హైదరాబాద్ ఇందిరాపార్కు సమీపంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసే ప్రదర్శన గోడ పత్రికను నిన్న పుస్తక ప్రదర్శన సలహాదారులు ప్రొఫెసర్ కోదండరాం , కె.రామచంద్రమూర్తి తదితరులు ఆవిష్కరించారు.

డెస్క్